కంపు కొడుతున్న కాలనీలు

- శివారు కాలనీల్లో మురుగు కష్టాలు
- ఇళ్ల మధ్యలోనే నిలుస్తున్న మురుగు
- రోగాలబారిన ప్రజలు
- పలుసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

వేములవాడ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లోని శివారు కాలనీల్లో మురుగు కష్టాలు నెలకొన్నాయి. పన్నుల వసూళ్లలో ముందున్న పాలకులు ప్రజా సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ శివారులోని కాలనీల్లో ఇళ్ల మధ్యలోనే మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.



విద్యానగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

వేములవాడ ప్రొఫైల్

- 45 వేల పైగా జనాభా
- 10 వేల పైగా గృహాలు
- 65 కిలోమీటర్ల వరకు ఓపెన్ డ్రైనేజీ
- 40 కిలోమీటర్ల వరకు మట్టి డ్రైన్
- రూ.38 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు


ఈ చిత్రంలోని మురుగునీరు బీమేశ్వర గార్డెన్ ప్రాంతంలోనిది. ఇళ్లన్నీ నూతనంగా నిర్మించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారే ఎక్కువ. పల్లెటూరు వాతావరణం నుంచి వచ్చినా ఇక్కడి జనం కాలనీల్లోనే నిలుస్తున్న మురుగునీటితో అవస్థలు పడుతున్నారు.

రోడ్డుపైనే మురుగునీరంతా ప్రవహించే ఈ చిత్రం మల్లారం జంక్షన్ లోనిది. నూతన కాలనీలో సరైన డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో మురుగునీరంతా ఇలా రోడ్డు పైనే పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇదొక్క ఈ ప్రాంతంలోనే కాకుండా పట్టణ శివారు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి.




ఇళ్ల మధ్యలోనే మురుగునీరు ఉన్న ఈ చిత్రం పట్టణంలోని పాపన్నచౌక్ ప్రాంతం లోనిది. దీంతో దోమలు వృద్ధి చెందడంతోపాటు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యం దుర్వాసన వెదజల్లి రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

దుర్వాసన వస్తోంది


మాది రెండో బైపాస్ రోడ్డుకు దగ్గరలోనే ఇల్లు. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరంతా ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. దీంతో అనారోగ్యం బారినపడుతున్నాం.

– మహమ్మద్ అసద్, స్థానికుడు

రూ. 38 కోట్లతో ప్రతిపాదనలు

వేములవాడ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.38 కోట్లతో ప్రతిపాదనలు అందించాం. ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతులు రాగానే పట్టణంలో పనులు ప్రారంభిస్తాం. శివారు కాలనీల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం. మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బండ మల్లేశం


మాట్లాడుతున్న ఎంపీపీ బండ మల్లేశం

వేములవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అధికారులకు సూచించారు. వేములవాడ మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ఎక్కడా లూజ్‌వైర్లు లేకుండా చూడాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు ఉన్నందున వాటిని వెంటనే సరిచేయాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో ప్రమాదాలు జరిగిన బాధితులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని, దీనిపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వారికి పరిహారం అందేలా చూడాలన్నారు. చాలాగ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనులు సరిగా జరగడం లేదన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రమేశ్, అన్నిశాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కుల కవిత, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఎంపీటీసీలు వెలుమ నర్సవ్వ, చెన్నాడి శ్యామల, బొడ్డు శంకరవ్వ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి


గంభీరావుపేట: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


కోనరావుపేట: మరిమడ్లలో ..

ముస్తాబాద్: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మండలంలోని కొండాపూర్, మద్దికుంట, గూడెం, పోతుగల్ గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, నాయకులు మీస సంజీవ్, యెల్ల గిరిధర్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రావు, సంతోష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మహేందర్, కృష్ణ, కల్యాణ్, మహేశ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, బావుసాయిపేటలో బండి సంజయ్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఉపాధిహామీ కూలీలకు వివరించారు. మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ ఎంపీటీసీ రేణుక, నాయకులు కుమ్మరి దిలీప్‌కుమార్, బైరగోని సురేశ్, తదితరులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట: నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని బండలింగంపల్లి, కోరుట్లపేట, సింగారంలో ఎంపీ బండి సంజయ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు మినహాజ్‌ఖాన్, సత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, కిరణ్‌నాయక్, రామచంద్రం, గణేశ్, శ్రీశైలం, రవి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా నాయకులు పత్తి స్వామి, బుచ్చిబాబు, బట్టు రాజు, ప్రసాద్‌రెడ్డి, కృష్ణాకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బాలరాజుపల్లిలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పిలుపుమేరకు బూత్ స్థాయి ప్రచారంనిర్వహించారు. పదేళ్లుగా కేంద్రంప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అక్రమ కేసుల్లో ఇరికించారు'


మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండల నాయకులు పలువురు 19 కేసుల్లో కోర్టుకు హాజరయ్యామని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా నమోదు చేయించారని ఆరోపించారు. కేసులకు హాజరైన వారిలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం గౌడ్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, గడ్డం మధుకర్ (ఛోటు), అరెపల్లి బాలు, పరుశరాములు, ప్రశాంత్, భరత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు

వేములవాడఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ యాజమానులు బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 55 కేసుల్లో రూ. 31,2,374 విలువగల మద్యం సీజ్‌చేసినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 68 కేసుల్లో రూ.2,55,500 విలువగల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇళ్లలో కిరాణా దుకాణాలు, బెల్ట్‌షాపులు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

జీఎస్టీపై కాంగ్రెస్ మొసలి కన్నీరు


మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జీఎస్టీపై కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే జీఎస్టీ ప్రతిపాదనలు పూర్తి చేసిందన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రావాల్సిన పాత బకాయిలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఆ పార్టీ నేతలు అనేక ఆరోపణలు బీజేపీపై చేయడం శోచనీయమన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే బకాయిలు విడుదల చేయించాలని కోరారు. మల్లారెడ్డి, కైలాశ్, నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు

కోనరావుపేట: ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్, నిమ్మపల్లిలో రహదారులపై పోసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 21వేలను గ్రామానికి చెందిన కదిరె హన్మంతరెడ్డి తమవంతు విరాళంగా అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన శివరాత్రి దుబ్బరాజం అనే బీడీ కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం తరఫున రూ.15వేలు ఆర్థికసాయంగా అందించినట్లు బద్దెపూరి శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇక్కడ టేకేదార్లు రంగయ్య, తుమ్మ శ్రీను, నర్సింలు, రాజు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సిరిసిల్లటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే. మహేందర్‌రెడ్డి సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మడుపు శ్రీదేవి, వైద్య శివప్రసాద్, మ్యానప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలి


గంభీరావుపేట: ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు

గంభీరావుపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. మండలంలోని గోరింటాల, రాజేశ్వర్‌రావునగర్, గజసింగవరం గ్రామాల్లో సోమవారం వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు దయాకర్‌రావు, రాజారాం, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, హరీశ్, బాల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, ఎంపీటీసీ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, పనిచేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని 24 గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు, కార్మికులు, నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములుగౌడ్, సందీప్, లక్ష్మణ్, హసన్, శ్రీనివాస్ రెడ్డి, కిషన్, ఆయాగ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు భూక్య తండా, బావుసింగ్‌నాయక్ తండా, బాబాయి చెరువు తండాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఎర్రగడ్డ తండాలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ బోయిని రవి, బీఆర్ఎస్ నాయకులు సాగర్, సురేశ్, రాజేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాద్: తెర్లుమద్దిలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్: ఎన్నికల హామీలను నేరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, ఎంపీపీ జనగామ శరత్ రావు అన్నారు. తెర్లుమద్ది, మోహినికుంట, రామలక్ష్మణపల్లెలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, గోపాల్‌రావు, విజయరామారావు, అక్కరాజు శ్రీనివాస్, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, చీటి వెంకటనర్సింగరావు, అంజయ్య, సర్వర్, కొమ్ము బాలయ్య, మల్లేశ్, బైతి నవీన్, కృష్ణ, భరత్, రామచంద్రం, రవీందర్‌రెడ్డి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిచేసే వారినే ఆశీర్వదించాలి

పనిచేసే నాయకుడికే ఎన్నికల్లో పట్టం కట్టాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, రాకేశ్, వెంకటేశ్, అరవింద్, రోహిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం


రుద్రంగి: ఉపాధిహామీ కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేట : సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి: కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, గుగ్గిల్ల వెంకటేశ్, దర్న మల్లేశం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మద్దతుగా మే 1న మండలకేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేస్తున్న కార్నర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ..కార్నర్ మీటింగ్‌కు భారీగ తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, అభ్యర్థి రాజేందర్‌రావు హాజకానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాంచందర్, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీగా 'బండి' చేసిందేమీ లేదు'


మాట్లాడుతున్న చీటి ఉమేష్‌రావు

సిరిసిల్లటౌన్: పదేళ్లలో బీజేపీ సాధించేంది ఏమీ లేదని ఆపార్టీని ప్రజలు విశ్వసించే స్థితిలో లేరని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు ఆరోపించారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు. మత విద్వేశాలు రెచ్చగొడుతూ..ఓట్లు సంపాదించే పనిలో బీజేపీ ఉందని, ఆపార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రైతు, మహిళా, కార్మిక, పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టో తయారు చేసిందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, నాయకులు ఎద్మల భూపాల్‌రెడ్డి, మంగ కిరణ్, మహిపాల్, రాజు, మల్లికార్జున్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగడ్డ గ్రామ శివారులో గంజాయి పట్టివేత ?

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ శివారులో సోమవారం గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. గంజాయితో పాటు ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై చందుర్తి పోలీసులను వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదని తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు 649 మంది హాజరు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఓపెన్ స్కూల్ ఇంటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 649 మంది హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. 89 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను అభినందిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికల జట్టు ఏప్రిల్ 27, 28 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కర్తల్ మండలం చరికొండలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అభినందించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పీఈటీ ప్రభాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న కనగర్తి బీసీ పాయింట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్ నిర్వాహకులు కొన్ని రోజులుగా ఖాతాదారులకు డబ్బులు ఇచ్చే విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వేలిముద్రలు తీసుకుంటూ ఖాతాల్లోని డబ్బులను డ్రా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖాతాదారులు డబ్బుల కోసం వెళ్తే గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారన్నారు. విచారణ జరిపి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ దేవరాజు, బీజేపీ, బీఆర్ఎస్ గ్రా మశాఖ అధ్యక్షుడు పోగుల లచ్చిరెడ్డి, పుట్ట గోపాల్ రెడ్డి, సింగిల్ విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూమిరెడ్డి, కరీంనగర్ డెయిరీ చైర్మన్ జిల్లెల్ల లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు బెంద్రపు శ్రీనివాస్ రెడ్డి, పులి వెంకటి, మోత్కుపల్లి తిరుపతి, పోతుగంటి లింగం, భూపతి, సోలుపాటి రాజు, గ్రామస్తులున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ సెస్ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కిష్టంపల్లిలో లో వోల్టేజీతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జిలు, ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ కాలిపోయాయన్నారు. బాధితులకు సెస్ సంస్థ తరఫున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సెస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

49వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రాజు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన కౌన్సిలర్ రాజు 49వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు. పట్టణానికి చెందిన మిర్యాల్‌కార్ జమున స్థానిక జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రక్తం అత్యవసరం కావడంతో విషయం తెలుసుకున్న కౌన్సిలర్ కల్లూరి రాజు వెంటనే ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజును వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది అభినందించారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

కోనరావుపేట: మండలకేంద్రంలో ఏఐటీయూసీ మేడే వేడుకల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సుతారి సంఘం కార్మికులతో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు మాట్లాడారు. మే 1న నిర్వహించే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సీతార సంఘం ప్రెసిడెంట్ అధ్యక్షుడు బైండ్ల శీను, కార్యదర్శి బొల్లె బాబు, తైదల చంద్రయ్య, భద్ర ఆనంద్ తాటకార్ల రవి, తమ్మిశెట్టి హజరత్, బొల్లె దేవయ్య, దొబ్బల గంగారాం, మైసయ్య, చంద్రమోహన్, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. బైక్ ఢీ

- గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల– కామారెడ్డి మార్గంలో సర్దాపూర్ వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 29 జెడ్ 3389) కరీంనగర్ వైపు వస్తుంది. బస్సు సర్దాపూర్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న బైక్ (ఏపీ 29 బీఎల్ 1460) ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.